సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 3 । నవంబర్ । 2024

వైభవం.. కార్తీక దీపోత్సవం

వేములవాడఅర్బన్: కార్తీమాసం సందర్భంగా రాజన్న ఆ లయంలో శనివారం సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్తీక మాసం మొద టి రోజు సందర్భంగా అర్చకుల వేద మంత్రాల మధ్య కా ర్తీకదీపాన్ని వెలిగించారు. ఆలయ స్థానాచార్యులు అ ప్పాల భీమాశంకర్, నమిలికొండ రాజేశ్వరశర్మ, అర్చకులు చంద్ర గిరి శరత్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

5 నుంచి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేసేందుకు వీలుగా అలింకో సంస్థ ద్వార ప్రత్యేక నిర్ధారణ శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈనెల 5న పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో పెద్దపల్లి, సుల్తానాబాద్, ధర్మారం, కాల్వ శ్రీరాంపూర్, ఓదెల మండలాల దివ్యాంగులు హాజరై నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. 6న మంథని ఎంపీడీవో ఆఫీసు ఆవరణలో మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాలకు చెందిన వారు హాజరు కావాలన్నారు. 7న గోదావరిఖని ఆర్జీ– 1 కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే ప్రత్యేక నిర్ధారణ శిబిరంలో రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాలకు చెందిన దివ్యాంగులు హాజరై పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమున్న వారికి ఉచితంగా ఉపకరణాలను అలింకో సంస్థ సమకూరుస్తుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్‌నంబరు 94408 52495, 70137 55418 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధాజ్ఞలు



ఎం.శ్రీనివాస్, సీపీ

గోదావరిఖని(రామగుండం): బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నట్లు రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ పౌరులు ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కమిషనరేట్ పరిధి మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో నెలరోజుల పాటు నిషేధాజ్ఞలు పొడిగిస్తున్నామని తెలిపారు. మద్యం తాగి రోడ్లపై అసభ్య పదజాలంతో మాట్లాడటం అన్నివర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించిందని ప్రజల భద్రత, రక్షణ కోసం నిషేధాజ్ఞల నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అలాగే చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించామని పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనలకు డీజే సౌండ్ వినియోగిస్తున్నారని, పలు కార్యక్రమాల నిర్వహణకు మైక్‌సెట్ వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసీపీల అనుమతి పొందాలని సూచించారు. పోలీసుల సూచనలు పెడచెవిన పెడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


బిల్లుల పెంపుపై హర్షం



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: సంక్షేమ వసతిగృహాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అందించే పోషకాహారం, కాస్మోటిక్ బిల్లులను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై పెద్దపల్లిలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు అంటూ ప్లకార్డులు చేతబూనారు. గతంలో 3నుంచి 7వ తరగతి వరకు రూ.950 ఉండగా ఇప్పుడు ఆ ధరలు రూ.1330 పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. 8నుంచి టెన్త్ వరకు ఉన్న రూ. 1,100ను రూ.1540, ఇంటర్, పీజీ విద్యార్థులకిచ్చే రూ.1500 లను రూ.2100కు పెంచిందని వివరించారు. దాదాపు డైట్ చార్జీలు 40శాతం మేర పెరిగాయని ప్రిన్సిపాల్ మణిదీప్తి, డెప్యూటీ వార్డెన్ సంధ్యారాణి పేర్కొన్నారు.

నాలుగు రైళ్లు.. అరగంట పాట్లు



గేట్ పడటంతో నిలిచిపోయిన వాహనాలు

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట్ – బల్లార్ష సెక్షన్ మధ్యలోని కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో లెవల్‌క్రాసింగ్ గేట్ పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శనివారం సాయంత్రం సికింద్రాబాద్, కాజీపేట్ నుంచి బల్లార్ష సెక్షన్ మధ్యలో ఒకేసారి నాలుగు రైళ్లు వరుసగా అప్ అండ్ డౌన్ వెళ్లడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో సుల్తానాబాద్ నుంచి జమ్మికుంట వైపు వెళ్లే ప్రయాణికులు అరగంట పాటు ఇబ్బందులు పడ్డారు. కొలనూర్ గేట్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

అమెరికా ఎన్నికల్లో.. ఎన్ని ప్రత్యేకతలలో!



సండే స్పెషల్



- రెండే పార్టీలు • నాలుగేళ్లకోసారి ఎన్నికలు • నవంబర్ మొదటి మంగళవారం నిర్వహణ
- టెక్నాలజీలో ముందున్నా ఇప్పటికీ బ్యాలెట్ విధానమే.. • అమెరికా పౌరసత్వం ఉంటేనే ఓటుహక్కు
- పోలింగ్‌కు ముందే ఆన్‌లైన్‌లో ఓటేయొచ్చు • ఓటు వేయనున్న పలువురు ఉమ్మడి జిల్లావాసులు

అమెరికా.. అగ్రరాజ్యం.. ఎంతోమంది ఒక్కసారైనా వెళ్లిరావాలని కలలుగనే దేశం. చదువు, ఉద్యోగాల పేరిట మన దేశం నుంచి చాలామంది అక్కడికి వెళ్లి, స్థిరపడ్డారు. ఇప్పటికీ వెళ్తున్నారు. ఆ దేశాధినేత ఎన్నిక ప్రక్రియ కీలక దశకు చేరింది. అక్టోబర్ 15 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు ఎర్లీ ఓటింగ్ ముగిసింది. 5న ఫైనల్ ఓటింగ్ జరగనుంది. ఎవరు గెలిచి వైట్‌హౌస్‌లో అడుగుపెడతారోనని ప్రపంచదేశాలు ఎదురుచూస్తున్నాయి. అమెరికా పౌరసత్వం ఉంటేనే ఓటుహక్కు వస్తుంది. టెక్నాలజీలో ముందున్నా ఇప్పటికీ ఎన్నికల్లో బ్యాలెట్ విధానమే అవలంబిస్తున్నారు. పౌరసత్వం ఐడీకార్డును ఓటువేసే మెషిన్‌లో పెడితే ఒపీనియన్ పోల్ వస్తుంది. ఎవరికి ఓటు వేయాలో వారిపేరుపై టచ్ స్క్రీన్‌లో టచ్ చేస్తే ప్రింట్ వస్తుంది. అందులో వివరాలు నింపి, బాక్స్‌లో వేస్తే ఓటు వేయడం పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో అమెరికాలో ఓటుహక్కు వినియోగించుకునే పలువురు ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసుల అభిప్రాయాలతో సండే స్పెషల్..!!

హోరాహోరీ పోరు



కరీంనగర్ స్పోర్ట్స్: మాది కరీంనగర్. నేను అమెరికా వచ్చి సుమారు 20 ఏళ్లవుతోంది. నార్త్ కరోలినా స్టేట్‌లోని వెల్స్ ఫార్గో కంపెనీ వైస్ ప్రెసిడెంట్‌గా, డెవలప్‌మెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాను. నా భార్య శ్వేత కూడా ఉద్యోగి. మాకు ఇద్దరు పిల్లలు. అమెరికా ఎన్నికల్లో ప్రతీసారి భారతీయుల చాయిస్ డిఫరెంట్‌గా ఉంటుంది. ఈసారి భారత సంతతికి చెందిన కమలాహారిస్ బరిలో ఉండటంతో భారతీయులు ఆమెకు సపోర్టు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అమెరికన్ భారతీయుల్లో బిజినెస్ చేసేవారు ట్రంప్‌కు మద్దతు తెలపనున్నారు. మొత్తంగా చూస్తే ఇద్దరి మధ్య పోరు హోరాహోరీగా ఉందనే చెప్పాలి.

– కదారి కృష్ణారెడ్డి, నార్త్ కరోలినా

భారతీయులు ట్రంప్ వైపే



ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మాది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం. అమెరికాలో స్థిరపడ్డాం. ఇక్కడి ఎన్నికల్లో నా భార్య సౌమ్యతో కలిసి మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకోవడం ఆనందంగా ఉంది. ఎర్లీ ఓటింగ్‌లోనే మేమిద్దరం ఓటు వేశాం. భారతీయులు ట్రంప్ వైపే మొగ్గు చూపుతున్నారు. భారతీయులకు భద్రత విషయంలో ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. ట్రంప్‌కే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

– పందిరి రజనీకాంత్, అట్లాంటా



ఓట్ ఫ్రం హోమ్: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.అధికారుల సమక్షంలో ఓటువేసి, ఎన్నికల సంఘానికి మెయిల్ చేయాలి.

మంగళవారమే ఎందుకు?: అప్పట్లో అమెరికా జనాభాలో ఎక్కువ మంది వ్యవసాయం చేసేవారు. నవంబర్ నెల ఆరంభంలో పంట నూర్పిడి చేసి, ఖాళీగా ఉండేవారు. అప్పుడే ఓటు వేసేందుకు సరైన సమయమని భావించారు. క్రైస్తవులు ఎక్కువగా ఆదివారం ఆరాధన దినంగా భావించేవారు. తమ వ్యవసా య ఉత్పత్తులను అమ్మేందుకు రైతులు బుధవారం మార్కెట్‌కు వెళ్లేవారు. అప్పట్లో రవాణా వ్యవస్థ అంతగా లేదు. దీంతో పోలింగ్ జరిగే కొన్ని ప్రాంతాలకు చేరుకోడానికి ఒక రోజు సమ యం పట్టేది. కాబట్టి సోమ, గురువారాలను పరిగణలోకి తీసుకోకుండా.. మంగళవారమే పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటినుంచి అమెరికాలో నవంబర్ నెల మొదటి మంగళవారమే ఎన్నికలు జరుగుతున్నాయి.

పోటీలో డెమోక్రాట్లు, రిపబ్లికన్లు: ఎన్నికల్లో పోలింగ్ తేదీకి ముందే ఆన్‌లైన్‌లో ఓటేయొచ్చు. నాలుగేళ్లకోసారి అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. పార్టీలు రెండే. డెమోక్రాట్లు, రిపబ్లికన్లు పోటీలో ఉంటారు. 50 రాష్ట్రాల నుంచి 100 మంది, న్యూయార్క్ నుంచి ముగ్గురు మొత్తం 103 సెనెటర్స్, 435 మంది ప్రతినిధులు మొత్తం 538 మందిని ఓటర్లు ఎన్నుకుంటారు. ఆ తర్వాత వీరు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు.

ఎన్నికల తీరును చూస్తున్న



శంకరపట్నం(మానకొండూర్): మాది శంకరపట్నం మండలంలోని గద్దపాక. టీచర్‌గా రిటైరయ్యాను. నా ఇద్దరు కూతుళ్లు అమెరికాలోని అట్లాంటాలో స్థిరపడ్డారు. ఇటీవలే వారి వద్దకు వచ్చాను. నేను టీచర్‌గా కరీంనగర్ జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల విధులు నిర్వర్తించాను. ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికాలో ఎన్నికల తీరును ప్రత్యక్షంగా చూస్తున్న.

– పల్కల శ్రీనివాస్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్

ఒక్కశాతం ఓట్లతోనే గెలుపు



ఇల్లంతకుంట(మానకొండూర్): మాది ఇల్లంతకుంట మండలంలోని ముస్కాన్‌పేట. నేను బీటెక్ చదివి, 2008లో అమెరికా వచ్చాను. డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న. ఇక్కడే స్థిరపడ్డారు. భార్య అంజలి, కూతురు ఉన్నారు. ఈ నెల 5న జరిగే అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ మధ్య హోరాహోరీ పోరు జరుగుతోంది. ఇద్దరిలో ఎవరు గెలిచినా ఒక్కశాతం ఓట్లతోనే గెలుస్తారు.

– కోమటిరెడ్డి వంశీధర్‌రెడ్డి, డల్లాస్

అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి పోలింగ్



హుజురాబాద్‌రూరల్: మాది హుజూరాబాద్. నేను ఏడాదిన్నరగా అమెరికాలోని డల్లాస్‌లో ఉద్యోగం చేస్తున్నాను. ఈ దేశాధ్యక్ష ఎన్నికల్లో టెక్నాలజీ ప్రభావం ఎక్కువగా ఉంది. పట్టణం, గ్రామీణ ప్రాంతమనే తేడా లేకుండా బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. అధ్యక్ష అభ్యర్థులతో చర్చలు నిర్వహించడం బాగుంది. అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి పోలింగ్ పూర్తయ్యేలా చూస్తారు. ఇక్కడి తెలుగు ప్రజలు భారత సంతతికి చెందిన కమలాహారిస్‌కు ఓటు వేసేందుకే ఆసక్తి చూపుతున్నారు.

– కె.సాయితేజ, డల్లాస్

గెలుపుపై సర్వత్రా ఆసక్తి



యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): మాది యైటింక్లయిన్‌కాలనీ. నేను అమెరికా స్కాంబర్గ్ ప్రాంతంలోని యూఎస్‌ఫుడ్స్‌లో ఇంజినీర్‌గా చేస్తున్నా. ఇక్కడ ఎలక్టోరల్ కాలేజ్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తారు. ఒక్కో స్టేట్‌లో ఏ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వచ్చాయో చూస్తారు. సదరు అభ్యర్థికి సంబంధిత స్టేట్ బాధ్యతలు అప్పగిస్తారు. ప్రస్తుతం ట్రంప్ కన్నా కమలాహారిస్‌కే ఎక్కువ మద్దతు ఉందన్న చర్చ జరుగుతోంది. కొన్ని ఏరియాల్లో ట్రంప్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఎవరు గెలుస్తారనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

– ఆడెపు ఉపేందర్, స్కాంబర్గ్

ట్రంప్ ప్రభుత్వం ఆదుకుంది



గోదావరిఖని(రామగుండం): మాది పెద్దపల్లి. అమెరికాలో వీసాల కోసం న్యాయసాయం చేస్తుంటాను. కరోనా సమయంలో ట్రంప్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ఆర్థికసాయం చేసి, ఆదుకుంది. ప్రస్తుతం ఉన్న డెమోక్రటిక్ ప్రభుత్వం ప్రజల ఆదరణ చూరగొనలేదు. అయితే, పాకిస్తాన్‌ను వచ్చి, ఇక్కడ స్థిరపడినవారు కమలాహారిస్‌కు మద్దతు ఇస్తున్నారు. భారతీయులు ట్రంప్‌వైపు మొగ్గు చూపుతున్నారు.

– కలవల విశ్వేశ్వర్‌రెడ్డి, వాషింగ్టన్ డీసీ

కమలాహారిస్‌కే ప్రియారిటీ



కరీంనగర్ స్పోర్ట్స్: మాది కరీంనగర్. నేను ఎంఎస్ కోసం అమెరికా వచ్చాను. ఏడాదవుతోంది. కన్సాస్ సిటీ స్టేట్‌లోని ఓవర్ ల్యాండ్ పార్క్‌లో ఫ్రెండ్స్‌తో కలిసి ఉంటున్నాను. అంతటా ఎన్నికల కోలాహలం కనిపిస్తోంది. నేను ఫస్ట్ టైమ్ అమెరికాలో ఎన్నికల తీరును చూడబోతున్న. భారత సంతతికి చెందిన కమలాహారిస్‌కు ఈ స్టేట్‌లో ప్రియారిటీ ఉంది.

– గన్ను అనిరుధ్ రెడ్డి, కన్సాస్ సిటీ

భారతీయులకు ఎక్కువ హామీలు



గోదావరిఖని(రామగుండం): మాది గోదావరిఖని. నేను అమెరికాలోని ఆస్టిన్ టెక్సాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. గ్రీన్ కార్డు సాధించాను. ఇక్కడి ఎన్నికలపై ప్రపంచ దేశాలన్నీ ఆసక్తిగా ఉన్నాయి. అయితే, ఎక్కువ మంది భారతీయులు భారత సంతతికి చెందిన కమలాహారిస్ కాకుండా డొనాల్డ్ ట్రంప్‌వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వంలో ఉపాధ్యక్షురాలిగా ఉన్న హారిస్‌కు అనుభవం ఉన్నప్పటికీ ప్రజల్లో వ్యతిరేకత ఉంది. కోవిడ్ కష్టకాలంలో ఆదుకోవడంతో ట్రంప్‌పై సానుభూతి ఎక్కువగా ఉంది. అంతేకాకుండా, భారతీయులకు ఆయనే ఎక్కువ హామీలు ఇచ్చారు.

– గంట మురళి, ఆస్టిన్ టెక్సాస్

ఫ్రీ బస్సు తప్ప ఏ పథకం అమలు కాలేదు

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్



మాట్లాడుతున్న భూపాల్

గోదావరిఖని(రామగుండం): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు హామీల్లో ఫ్రీబస్ తప్ప ఏఒక్కటి కూడా అమలు కాలేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ విమర్శించారు. శనివారం అమరవీరుల జెండా ఆవిష్కరణతో గోదావరిఖని పట్టణ రెండో మహాసభలు గంగానగర్ మల్లు స్వరాజ్యం కాలనీలో ప్రారంభమయ్యాయి. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో కొన్ని నెలలుగా ఇల్లు లేని పేదలందరికీ తక్షణమే పట్టాలివ్వాలన్నారు. గంగానగర్‌లో తొలగించిన ఇళ్ల యజమానులకు స్థలాలిచ్చి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటుపరం చేయకుండా సింగరేణికే అప్పగించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ప్రతీ సింగరేణి ఉద్యోగికి 250 గజాల స్థలం కేటాయించి రూ.30లక్షలు వడ్డీ లేని రుణం యాజమాన్యం ఇవ్వాలని, కార్మికవాడల్లో తాగునీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలు సత్వరం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్యంరావు, మహేశ్వరి, రమాచారి, వేల్పుల కుమారస్వామి, మండే శ్రీనివాస్, మేదరి సారయ్య, వడ్లకొండ నాగమణి, నరసన్న, ఉపేందర్, జన్నె కొమురయ్య, మారుపాక భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమానత్వ సాధన కోసమే కులగణన

- పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్



సమావేశంలో ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, సంఘాల నాయకులు

పెద్దపల్లిరూరల్: సమాజంలో అన్నివర్గాల ప్రజలను సమానత్వంగా చూడడం కోసమే ప్రభుత్వం కులగణన చేపట్టిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లిలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యేలతో పాటు సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రజలందరి ఆర్థిక, సామాజిక స్థితిగతులతో పాటు కులగణన చేసేందుకే ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సంఘాలు, పార్టీల నాయకులు బి.రమేశ్‌గౌడ్, తుల మనోహర్‌రావు, కోట శ్రీనివాస్‌గౌడ్, చిలుక సతీశ్, కార్పొరేటర్ సుజాత, మార్కెట్ చైర్మన్లు స్వరూప, ప్రకాశ్‌రావు, గండు సంజీవ్, బొద్దుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మీ పేరు ఉందో చూసుకోండి

- ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- 3,517 పోలింగ్ కేంద్రాలు..
- 29,90,319 ఓటర్లు
- మార్పులు చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం
- 2025 జనవరి 6న తుది జాబితా విడుదల

ఉమ్మడి జిల్లా ఓటరు ముసాయిదా జాబితా వివరాలు

అసెంబ్లీ	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
జగిత్యాల	254	1,13,928	1,23,872	23	2,37,823
కోరుట్ల	262	1,17,287	1,29,916	4	2,47,207
ధర్మపురి	269	1,12,972	1,18,863	9	2,31,844
రామగుండం	262	1,10,011	1,10,303	28	2,20,342
మంథని	292	1,17,953	1,23,148	15	2,41,116
పెద్దపల్లి	291	1,27,106	1,30,920	7	2,58,033
కరీంనగర్	390	1,82,791	1,83,810	45	3,66,646
చొప్పదండి	327	1,13,314	1,21,179	8	2,34,501
మానకొండూర్	316	1,10,503	1,16,063	1	2,26,567
హుజూరాబాద్	305	1,22,215	1,29,122	7	2,51,344
వేములవాడ	262	108675	118808	30	227513
సిరిసిల్ల	287	1,20,070	1,27,306	7	2,47,383
మొత్తం	3,517	14,56,825	15,33,310	184	29,90,319



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఎన్నికల సంఘం ఏటా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ సమ్మరీ రివిజన్–ఎస్ఎస్ఆర్) షెడ్యూల్ ప్రకటించి.. నవంబర్‌లో ముసాయిదా జాబితా.. జనవరిలో తుది ఓటరు జాబితా విడుదల చేస్తుంది. ఓటర్ జాబితా తయారీలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18వ వరకు బీఎల్వోలు ఇంటింటా సర్వే నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదుతోపాటు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టేందుకు వీలుగా రాష్ట్ర ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 3,517 పోలింగ్ కేంద్రాల్లో 29,90,319 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు.

మహిళా ఓటర్లే ఎక్కువ

ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కరీంనగర్‌లో అత్యధిక ఓటర్లు 3,66,646 మంది ఉన్నారు. అత్యల్పంగా రామగుండంలో 2,20,342 మంది ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29,90,319 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుష ఓటర్లు 14,56,825 మంది ఉండగా.. మహిళలు 15,33,310 మంది, ఇతరులు 184మంది ఉన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

విడుదల చేసిన ముసాయిదా జాబితాలో ఏమైనా చేర్పులు, తొలగింపులు, సవరణలు తదితర అభ్యంతరాలు ఉంటే నవంబర్ 28వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారు. కొత్తగా చేరాలనుకునే వారు ఫాం-6, తొలగించుకోవాలనుకునే వారు ఫాం-7, సవరణ చేసుకోవాలనుకునే వారు ఫాం-8 ఆధారంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 2025 జనవరి ఒకటి నాటికి 18 ఏళ్ల వయస్సు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు చేసేందుకు నవంబరు 9, 10 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది జాబితాను ప్రకటించనున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



జైదీప్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం గోపీకృష్ణ, టీచర్లు

కొత్తపల్లి(కరీంనగర్): 68వ రాష్ట్రస్థాయి అండర్-17(బాలుర) ఎస్జీఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలకు పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థి ఎస్.జైదీప్(పదోతరగతి) ఎంపికైనట్లు హెచ్‌ఎం గోపీకృష్ణ తెలిపారు. జగిత్యాల జిల్లాలో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచాడన్నారు. కొత్తగూడెంలో ఆదివారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జైదీప్‌ను విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వి.యు.యం.ప్రసాద్, హన్మంతరావు శనివారం అభినందించారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు నాగరాజు, రాము, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.సాగర్, జి.మహేశ్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గోదావరిఖని(రామగుండం): తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి, బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాల ప్రకారం.. గోదావరిఖని గాంధీనగర్‌లోని సింగరేణి కార్మికుడు యశోద కృష్ణ ఇంటికి తాళం వేసి, దీపావళి పండుగకు కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లాడు. శనివారం తిరిగి రాగా, ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని రెండున్నర తులాల బంగారం, రూ.17 వేలు కనిపించలేదు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. వారు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చేస్తున్నారు.

యువతిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం: యువతిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తెలిపారు. ఎస్సై భాస్కర్ రెడ్డి వివరాల ప్రకారం.. నగరంలోని గోదాంగడ్డకు చెందిన రమేశ్, ఓ యువతి కొన్ని రోజులు సహజీవనం చేశారు. వారి మధ్య విభేదాలు రావడంతో విడిగా ఉంటున్నారు. ఈ మధ్య రమేశ్ ఆమెతో గొడవ పడి, దాడి చేశాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో శనివారం బాలబాలికలకు జిల్లాస్థాయి అథ్లెటిక్, ఈవెంట్ (అండర్- 14, 17) పోటీలు నిర్వహించారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈనెల 4న కరీంనగర్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పీడీ రవి, సోమశేఖర్, దుర్గాప్రసాద్, స్వర్ణలత, శ్రీధర్, నర్మద, పుష్పలత పాల్గొన్నారు.

సెంటినరికాలనీలో నీటిఎద్దడి

- నాలుగు రోజులకోసారి సరఫరా
- ఇబ్బంది పడుతున్న కార్మిక కుటుంబాలు



అప్పుడే తాగునీటి తండ్లాట మొదలైంది. వానాకాలం వెళ్లి చలికాలం ప్రారంభంలోనే నీటి కష్టాలు మొదలయ్యాయి. సెంటినరికాలనీలో కార్మిక కుటుంబాలకు నీటి ఎద్దడి తీవ్రమవడంతో సింగరేణి యాజమాన్యం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తోంది. ట్యాంకర్ల ద్వారా తెచ్చే నీటికోసం ఇలా ఇళ్ల ఎదుట డ్రమ్ములు ఏర్పాటు చేసుకున్నారు. నాలుగురోజులకోసారి నీరు సరఫరా చేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. డ్రమ్ము నీళ్లు ఎటూ సరిపోవడం లేదని వాపోతున్నారు.



చేతిపంపునకు ఏర్పాటు చేసిన మోటార్

రామగిరి(మంథని): ఆర్జీ–3 ఏరియా సెంటినరికాలనీలో నీటి కష్టాలు మొదలయ్యాయి. కాలనీలో సుమారు 2,000 కార్మిక కుటుంబాలు ఉంటాయి. తాగునీటి సరఫరాకు రోజూ 7లక్షల గ్యాలన్ల నీరు అవసరం. గోదావరినది నుంచి ఆర్జీ–2 యైటింక్లయిన్ పంపుహౌస్ ద్వారా నీటి సరఫరా చేస్తారు. గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీకి సరిపడా నీటిని పంపింగ్ చేసుకున్న తర్వాత సెంటనరీకాలనీకి సరఫరా చేస్తున్నారు. సుమారు 13 గంటలు రావాల్సిన నీరు 8 గంటలు రావడంతో కష్టాలు తప్పడం లేదు. పాత పంపులు, మోటార్లు కావడంతోనే తరచూ మొరాయిస్తున్నాయని, నీరు సరిగా రావడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు.

చేతిపంపులకు మోటార్లు..

తాగునీటి కోసం కార్మికులు ఇబ్బందులు పడుతుంటే కొంత మంది ఇష్టారీతిన చేతిపంపులకు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేస్తుకున్నారు. దీంతో బోర్ల వద్ద వెళ్లే పరిస్థితి లేదు. నీటి ఇబ్బందులను సంబంధిత అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో కాలనీకి చెందిన మహిళలు ఇటీవల జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేసేందుకు వెళ్లగా, రెండు రోజుల్లో సమస్య పరిష్కారిస్తామని కార్యాలయ సిబ్బంది చెప్పడంతో వెనుతిరిగారు. అలాగే బోర్లకు ఏర్పాటు చేసిన మోటార్లు తొలగిస్తే కార్మికుల తాగునీటి వసతికి కొంత ఉపశమనం లభిస్తుంది.

> **తాగునీటి సరఫరా పెంచేందుకు చర్యలు**
>
> 
>
> గోదావరిలో నీటి నిల్వ తగ్గుముఖం పడుతుండటంతో రాబోయే రోజుల్లో కష్టాలు తప్పేలా లేవు. కార్మిక కుటుంబాలకు నీటి సరఫరా చేసేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటుంది. పైపులైన్ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నాం. యైటింక్లయిన్‌కాలనీ నుంచి నీటి సరఫరాలో ఇబ్బందులతో సమస్యలు తలెత్తాయి.
>
> – నరేంద్ర సుధాకర్‌రావు, ఆర్జీ–3 జీఎం

ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టాలి



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని: ఇంటింటి సర్వేకు హౌస్ లిస్టింగ్ పక్కాగా చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం మంథనిలోని శ్రీరాంనగర్‌లో సర్వేను పరిశీలించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు, మాతా శిశు, సామాజిక వైద్యశాలను సందర్శించారు. ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు ఉంటే వేర్వేరుగా వివరాలు సేకరించాలన్నారు. మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రం వద్ద అవసరం మేరకు టార్పాలిన్లు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మాతాశిశు ప్రహరీ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. మంథని ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థో సేవలు భేష్

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఆర్థోపెడిక్ సేవలు ఎంతో మెరుగయ్యాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష వైద్యులను అభినందించారు. గతంలో నెలకు 4 ఆపరేషన్లు మించలేదని, కానీ గత మూడునెలల్లో 120 శస్త్రచికిత్సలు చేసి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించారని పేర్కొన్నారు. కాళ్లు వంకరగా పుట్టిన నవజాత శిశువులకు సంబంధించి వైద్యసేవలు అందిస్తున్నామని, ఇప్పటివరకు ఆరుగురు నవజాత శిశువులకు అందించామని డాక్టర్ శ్రీధర్ తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఇంజినీరింగు అధికారులతో సమీక్షించారు. అమ్మ ఆదర్శపాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేసి బిల్లులు సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఈఈ గిరిశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్సు

రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్సులో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ వేణు తదితరులున్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం అధికారులతో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ శనివారం సమావేశమయ్యారు. రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిభవన్‌కు ఎంపీ చేరుకోగా అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జీఎం అలోక్, అధికారులు సురేశ్, ఏజీఎం హెచ్‌ఆర్ బిజయ్‌కుమార్ సిగ్దర్, తిరుపతి, సంజయ్ సాహూ, యుగంధర్‌రావులు సమావేశమై తెలంగాణ ప్రాజెక్టు పనితీరును ఎంపీకి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సూచించారు. అనంతరం మంచిర్యాల జిల్లా పర్యటనకు బయలుదేరారు. కాగా, ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో ఎంపీ వంశీకృష్ణకు యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ జావేద్, చెన్న రమేశ్, గుడికందుల శ్రీనివాస్, తేజ, అయూబ్, వినోద్, వర్మ, పుట్టపర్తి నరేశ్‌గౌడ్, శ్రావణ్ ఘన స్వాగతం పలికారు.

'యంగ్ ఏషియన్ సైంటిస్ట్ ఫెలోషిప్' అందజేత



వేములవాడఅర్బన్: వేములవాడకు చెందిన యువ శాస్త్రవేత్త గంజి మహిపాల్ రెడ్డి యంగ్ ఏషియన్ సైంటిస్ట్ ఫెలోషిప్–2024 అవార్డు అందుకున్నారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో ఆయన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. హాంకాంగ్ ఏషియన్ యంగ్ సైంటిస్ట్ ఫెలోషిప్, హాంకాంగ్ అకాడమీ ఆఫ్ సైన్స్, ది యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ సంస్థలు సంయుక్తంగా ఈ అవార్డును శుక్రవారం హాంకాంగ్‌లో ప్రదానం చేశాయి.

బీఆర్‌ఎస్ పదవులు బీసీలకు ఇవ్వండి

- కులగణనలో దేశానికి తెలంగాణ దిక్సూచి
- బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: బీసీలపై బీఆర్‌ఎస్‌కు నిజమైన ప్రేమ ఉంటే ఆ పార్టీ కీలక పదవులను బీసీలకు ఇవ్వాలని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టనున్న నేపథ్యంలో శనివారం కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్ష, శాసనసభాపక్ష నేత పదవులు అన్ని కేసీఆర్ కుటుంబానికే ఉన్నాయన్నారు. ఆ పార్టీకి బీసీల అభ్యున్నతిపై చిత్తశుద్ధి ఉంటే ఈ పదవుల్లో బీసీలను నియమించాలని సవాల్ విసిరారు. కరీంనగర్‌లో బీసీ కమిషన్ పర్యటన సందర్భంగా నిలదీసేందుకు కూడా బీఆర్‌ఎస్‌కు బీసీ ఎమ్మెల్యే లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. కులగణనలో దేశానికే తెలంగాణ దిక్సూచిగా మారుతోందన్నారు. సంవత్సరాల డిమాండ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని తెలిపారు. ఇంటింటి కుటుంబ సర్వే ఒక చారిత్రక ఘట్టమని, ఇందులో కాంగ్రెస్ కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీలపై మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ బీజేపీ హామీ ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయో చెప్పాలన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

- ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ఏకకాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లి, బొంతకుంటపల్లి, భూపతిపూర్, ఐతరాజుపల్లి, దుబ్బపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కటింగ్ లేకుండా మద్దతు ధర లభిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, వైస్ చైర్మన్ దీకొండ శ్రీనివాస్, సీఈవో నభియొద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందిలేకుండా చూడాలి

ఓదెల(పెద్దపల్లి): తాను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు ధాన్యం తూకంలో కటింగ్ ఉండదని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. శనివారం ఓదెల మండలం ఉప్పరపల్లె, గోపరపల్లె, హరిపురం, నాంసానిపల్లె, లంబాడితండా, కొమిర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. సెంటర్‌లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది చూడలన్నారు. పొత్కపల్లి విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, సీఈవో గోళి అంజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ సర్పంచులు బొంగోని రాజయ్యగౌడ్, కొప్పుల రవి, మాజీ ఎంపీటీసీ చొప్పరి రాజన్న, నాయకులు చింతిరెడ్డి విజేందర్‌రెడ్డి, గట్టు యాదవ్, హరికాంత్, పల్లె సురేశ్ పాల్గొన్నారు.

కట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య



సమత మృతదేహం

ముత్తారం(మంథని): ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ పంచాయతీ పరిధి అబ్రాబాద్‌కు చెందిన చేద అలియాస్ బిస్కుల సమత(26) శనివారం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలు..జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం మల్లారం గ్రామానికి చెందిన చేద లక్ష్మి– లక్ష్మయ్య దంపతుల కూతురు సమత 2022లో అబ్రాబాద్‌కు చెందిన సంతోశ్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. కొంత కాలం సజావుగా సాగిన వీరి కాపురంలో సంతోశ్ వరకట్నం, శారీర వేధింపులకు గురి చేయడంతో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకుంది. తమ కూతురు చావుకు సంతోశ్ కారణమని మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మృతురాలికి పదేళ్ల కుమారుడు ఉన్నాడు.

మైదంబండలో యువకుడు..



అజయ్(ఫైల్)

ముత్తారం(మంథని): ముత్తారం మండలం మైదంబండకు చెందిన బియ్యని అజయ్ (24) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. అజయ్ ఓ యువతిని ప్రేమించాడు. వీరి పెళ్లికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి మొగిళి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

కేడీసీసీబీ చైర్మన్ 'కొండూరి'కి పరాభవం

- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించకుండానే వెళ్లిపోయిన వైనం
- వెన్కెపల్లిలో ఘటన



ఎదురుచూస్తున్న చైర్మన్ రవీందర్‌రావు

సైదాపూర్: నాఫ్‌స్కాబ్ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుకు పరాభవం ఎదురైంది. సైదాపూర్ మండలంలోని వెన్కెపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు రావాలని నాలుగు రోజుల క్రితం వెన్కెపల్లి విశాల సహకార సంఘం చైర్మన్ తిరుపతిరెడ్డి ఆయనను ఆహ్వానించారు. అప్పుడు సమయం కుదరక రాలేదు. శనివారం సాయంత్రం 4 గంటలకు కేంద్రాన్ని ప్రారంభించేందుకు వస్తున్నట్లు చెప్పి, సమయానికే వచ్చారు. సంఘం భవనంలో గంటపాటు తిరుపతిరెడ్డి కోసం ఎదురుచూశారు. అయినా, ఆయన రాలేదు. తిరుపతిరెడ్డి బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు తనతో పనులు చేయించుకున్నాడని, ఇటీవల కాంగ్రెస్‌లో చేరి, తనను రమ్మని చెప్పి, ఆయన రాకుండా అవమానించారంటూ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకుండానే వెళ్లిపోయారు. తర్వాత చైర్మన్ తిరుపతిరెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, డైరెక్టర్లు, సీఈవోపాల్గొన్నారు.

వరుస చోరీలు.. ఆందోళనలో రైతులు

- వాహనాల పరికరాలు ఎత్తుకెళ్తున్న దొంగలు



బ్యాటరీ, హైడ్రాలిక్ పట్టీలు దొంగిలించబడిన ట్రాక్టర్

ధర్మారం(ధర్మపురి): గ్రామాల్లో జరుగుతున్న చోరీలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇంటి ఎదుట భద్రంగా ఉంటుందని రైతుల తమ ట్రాక్టర్‌లను పార్కింగ్ చేసినా దొంగల నుంచి కాపాడుకోలేకపోతున్నారు. ట్రాక్టర్ విడి భాగాలను దొంగలు యథేచ్ఛగా దొంగిలించుకపోతున్న ఘటనలు ధర్మారం మండలంలో ఇటీవల కాలంలో కలకలం రేపుతున్నాయి. 20 రోజుల క్రితం మండలంలోని బొమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు హార్వెస్టర్‌ను తన వ్యవసాయ భూమిలో పార్కింగ్ చేయగా, అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ బాలురు దాదాపు రూ.లక్ష విలువగల విడి పరికరాలను ఎత్తుకెళ్లి ధర్మారం శివారులోని స్క్రాప్ దుకాణంలో విక్రయించారు. హార్వెస్టర్ పరికరాలు చోరీకి గురైనట్లు గమనించిన సదరు రైతు నిఘా పెట్టాడు. ఈక్రమంలో హార్వెస్టర్ పరికరాన్ని విక్రయించేందుకు ఓ మైనర్ బాలుడు సైకిల్‌పై ధర్మారం తీసుకవస్తుండగా రైతుకు అనుమానం వచ్చి ప్రశ్నించాడు. సదరు మైనర్ తానొక్కడినే కాదని, మరో ఇద్దరం కలిసి హార్వెస్టర్ పరికరాలు దొంగతనం చేసి ధర్మారంలోని స్క్రాప్ దుకాణంలో విక్రయించినట్లు తెలిపాడు. వెంటనే రైతు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ముగ్గురు మైనర్ బాలురను స్క్రాప్ దుకాణం వద్దకు తీసుకెళ్లారు. సదరు బాలురు తనకే పరికరాలు విక్రయించారని దుకాణదారు ఒప్పుకున్నాడు. కాగా, పరికరాల చోరీపై సదరు రైతు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదు. ఈక్రమంలో గత నెల 30న మండలంలోని బంజేరుపల్లి తండాకు చెందిన గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీతో పాటు మరో రెండు ట్రాక్టర్‌ల హైడ్రాలిక్ పట్టీలను దొంగలు ఎత్తుకెళ్లారు. అదే రాత్రి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో వాటర్‌ప్లాంట్ ఆటో బ్యాటరీతో పాటు మరో రెండు ట్రాక్టర్ల హైడ్రాలిక్ పట్టీలు, బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. అదే నెల 31న మండలంలోని కటికెనపల్లి శివారులో ఎస్‌ఆర్‌ఆర్ బ్రిక్స్ పరిశ్రమలోని టిప్పర్, రెండు ట్రాక్టర్లు, రెండు ఆటోలకు సంబంధించిన బ్యాటరీలతో పాటు హైడ్రాలిక్ పట్టీలను దొంగలు ఎత్తుకెళ్లి దాదాపు రూ.80వేల నష్టం చేసినట్లు పరిశ్రమ యజమాని రాజ్‌కుమార్ తెలిపాడు.

గంజాయి కోసమేనా..?

మండలంలోని పలు గ్రామాల్లో కొందరు యువకులు గంజాయికి బానిసై చోరీలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల శివారులోని మామిడితోటలు, గుట్టల సమీపంలో అడ్డా ఏర్పాటు చేసుకుని నిత్యం గంజాయిని సేవిస్తూ వికృతచేష్టలకు పాల్పడుతున్నారని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతే కాకుండా రూ.లక్షలు విలువ చేసే వాహనాల పరికరాలను స్క్రాప్ దుకాణదారులకు అతి తక్కువ ధరలకే విక్రయిస్తుండటంతో వారు పోటీపడి కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులు చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెద్దల యాదిలో..







చనిపోయిన వారి జ్ఞాపకార్థం క్రైస్తవులు ఏటా నవంబర్ 2న సమాధుల పండుగ (ఆల్ సోల్స్ డే)ను ప్రపంచవ్యాప్తంగా కుటుంబ సమేతంగా జరుపుకుంటారు. సమాధుల వద్ద నివాళులర్పించి వారిని స్మరిస్తారు. ఈసందర్భంగా శనివారం రాత్రి పెద్దపల్లిలోని రంగంపల్లి శ్మశానవాటికలో సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి పండగ వాతావరణంలో ఆల్ సోల్స్ డేను జరుపుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

కార్తీకం.. శుభకరం



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి ఆలయంలో కార్తీకమాసం వేడుకలను శనివారం ప్రారంభించారు. వేడుకలు నెలరోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. మొదటిరోజైన శనివారం సాయంత్రం గోదావరికి హారతి ఇచ్చారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిరోజూ నిర్వహించే గోదావరి హారతి కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తమ్మ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.